క్లుప్తంగా

హోమియోపతి ఆసుపత్రి తనిఖీ

కడప రూరల్: కడప నగరం పాత రిమ్స్‌లో గల ప్రభుత్వ హోమియోపతి ఆసుపత్రిని ఆయుష్ కమిషనర్ రాజేంద్రకుమార్ శనివారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా ఔట్ పేషెంట్స్, ఇన్ పేషెంట్స్, వైద్య పరీక్షల గదులను పరిశీలించారు. ఇందుకు సంబంధించిన వివరాలను అడిగితెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆనంద రావు, సిబ్బంది మురళి తదితరులు పాల్గొన్నారు.

అందరికీ ఆరోగ్య సు'రక్ష'

కడప రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల ద్వారా ప్రభుత్వం ప్రజలకు ఆరోగ్య రక్షణను కల్పిస్తోంది. ఈ మెడికల్ క్యాంపులకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. శుక్రవారం జిల్లాలో 11 ప్రాంతాల్లో వైద్య శిబిరాలు జరిగాయి. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

29న ఉచిత వైద్య శిబిరం

కడప కల్చరల్ : కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 29 న కడప నగరం కేంద్ర కారాగారం వద్దగల మదరసా-యే-ఉస్మాన్ బిన్ ఆఫాన్ మైదానంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సొసైటీ అధ్యక్షులు డాక్టర్ ముక్తార్ అహ్మద్ తెలిపారు. వైద్య శిబిరానికి ప్రైమ్ ఆస్పత్రి సహకారం ఉందని, ఆ ఆస్పత్రి వైద్యులు పరీక్షలు, చికిత్సలు చేస్తారని తెలిపారు. బీపీ, షుగర్ తదితర సమస్యలకు ఉచితంగా పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు ఉచితంగా అందజేస్తారని తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషతోపాటు పలువురు ప్రముఖులు పాల్గొంటారని ఆయన వివరించారు.

పాలస్తీనాపై దాడులు ఆపాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : పాలస్తీనాపై ఇజ్రాయెల్ చేపట్టే దాడులు ఆపాలని, గాజాలో శాంతి నెలకొల్పాలని ఆప్ కి ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి మగ్బూల్‌బాష కోరారు. శుక్రవారం నగరంలోని సంస్థ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆప్ కి ఆవాజ్ నగర అధ్యక్షులు ఆబిద్ హుస్సేన్, కమిటీ ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

31న సాహితీ సదస్సు

కడప కల్చరల్ : కడప నగరంలోని బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఈనెల 31వ తేదీ ఉదయం 10.00 గంటలకు సాహితీ సదస్సు నిర్వహించనున్నట్లు బ్రౌన్ కేంద్రం సంచాలకులు ఆచార్య తప్పెట రామప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించనున్న సభకు హౌసింగ్‌బోర్డు శ్రీ కోదండ రామాలయ ధర్మకర్త దేశు వెంకటరెడ్డి అధ్యక్షత వహిస్తారని, తెలుగు సాహిత్యంలో శ్రీ ఒంటిమిట్ట కోదండ రామస్వామి అనే అంశంపై రాజంపేట స్పెషల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ విద్వాన్ పసుపులేటి శంకర్ ప్రసంగిస్తారని తెలిపారు.

కనీస వేతనాలు ఇవ్వాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు ఉపాధ్యాయులకు కనీస వేతనాలు ఇవ్వాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి సురేష్ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ ఉపాధ్యాయులు, అధ్యాపకులకు చాలీ చాలని వేతనాలతో వెట్టి చాకిరి చేయించుకుంటున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ నగర సహాయ కార్యదర్శి బి సంజీవ్ , ఉపాధ్యక్షులు నాగార్జున పాల్గొన్నారు.

రాష్ట్ర విభజన హామీలను నెరవేర్చాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్ర విభజన చట్టంలోని హామీలను నెరవేర్చాలని సీపీఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు వెంకటసుబ్బయ్య, పి. చంద్రారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నవంబర్ 1న జరిగే ప్రజారక్షణ భేరి భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ నగరంలో వివిధ ఆటో స్టాండ్ లలో కరపత్రాలతో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సీపీఎం ప్రజారక్షణ భేరి ఈ నెల 30వ తేదీ నుండి మూడు ప్రాంతాల నుండి యాత్ర ప్రారంభమవుతుందని కడపకు నవంబర్ 1న చేరుకుంటుందన్నారు. ఈ నేపథ్యంలోనే పాత బస్టాండ్ లో భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజారక్షణ భేరి యాత్రను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో నగర కమిటీ సభ్యులు ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

పేదలందరికీ సంక్షేమ పథకాలు

– ఉప ముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్ బాషా

కడప కార్పొరేషన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో బడుగు, బలహీన, అణగారిన వర్గాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చారని ఉపముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్ బాషా గుర్తుచేశారు. శుక్రవారం 'గడప గడపకు మన ప్రభుత్వం'లో భాగంగా 3 డివిజన్‌లోని ఆటో నగర్, పీఎస్ నగర్ ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఏవిధంగా చేరుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభ్యున్నతే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయంగా ముఖ్యమంత్రి పనిచేస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కుల,మత, పార్టీలకతీతంగా అర్హత ఉన్న పేద ప్రజలందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నారని, ఆయన్ను మళ్లీ ఆశీర్వదించాలని కోరారు.

– ఈ సందర్భంగా సయ్యద్ హబీబుల్లా అనే వ్యక్తి మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో తమ కుటుంబానికి ఇంటి స్థలం, ఇల్లు, వైఎస్సార్ వాహన మిత్ర, వైఎస్సార్ ఆసరా, సున్నావడ్డీ పథకాల ద్వారా రూ.9.09లక్షల మేలు జరిగిందని సంతోషం వ్యక్తం చేశాడు.

– సయ్యద్ జమీరున్నీసా అనే మహిళ మాట్లాడుతూ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, ఇంటి స్థలం, ఇల్లు పథకాల ద్వారా తమకు రూ.9.32లక్షల లబ్ధి కలిగిందని ఆనందం వ్యక్తం చేసింది. ఏ ప్రభుత్వంలోనూ ఇంత లబ్ధి చేకూరలేదని, జగనన్నకు తామంతా తోడుగా ఉంటామని తెలిపారు.

– కార్యక్రమంలో 3వ డివిజన్ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి సుదర్శన్‌రెడ్డి, నాయకులు బాలక్రిష్టారెడ్డి, శ్రీరంజన్‌రెడ్డి, చెన్నయ్య, బంగారు నాగయ్య, తోట క్రిష్ణ, సుబ్బారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, షఫీవుల్లా, కువైట్ సుబ్బారెడ్డి, జింకా విజయలక్ష్మి పాల్గొన్నారు.



'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ప్రజలతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

అణువణువునా రగిలే దేశభక్తి

వైవీయూ : నా మట్టి.. నా దేశం.. అంటూ విద్యార్థులు అణువణువునా దేశభక్తి నింపుకుని చేపట్టిన తిరంగా యాత్ర ఎంతో ఉత్సాహంగా సాగింది. నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో 'మేరీ మట్టి.. మేరీ దేశ్' కార్యక్రమంలో భాగంగా అమృత కలశ యాత్ర నిర్వహించారు. శుక్రవారం కడప నగరంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా రెవిన్యూ అధికారి గంగాధర్ గౌడ్ విచ్చేసి జెండా ఊపి తిరంగా ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నా మట్టి.. నాదేశం అనే మహోన్నతమైన కార్యక్రమం భారతదేశ పౌరులైన ప్రతి ఒక్కరిలోనూ దేశభక్తి పెంపొందించేందుకు దోహదం చేస్తుందన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా ప్రజల్లో ఐకమత్యం పెరుగుతుందన్నారు. నెహ్రూ యువకేంద్రం జిల్లా కోఆర్డినేటర్ మణికంఠ మాట్లాడారు. అనంతరం తిరంగా ర్యాలీ కడపనగర పురవీధుల వెంబడి సాగుతూ ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వరకు సాగింది. అనంతరం మాజీ సైనికుడు కె.వి. రావును నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో స్టెప్ మేనేజర్ సుబ్బరాయుడు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

కోటిరెడ్డి మహిళా డిగ్రీ కళాశాలలో..

కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థినులు 'అమృత కలశ యాత్ర' నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు సేకరించిన మట్టిని కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సలీం బాషా కలశాల్లో వేసి వీరుల త్యాగఫలాల గురించి వివరించారు. అనంతరం కళాశాల విద్యార్థినులు భారీ త్రివర్ణ పతాకంతో మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా. గురివిరెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా. పి. శచీదేవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

కడప కోటిరెడ్డిసర్కిల్ : దేశ ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు మేరీ మట్టి-మేరీ దేశ్ (మన దేశం -మన మట్టి) కార్యక్రమంలో భాగంగా బీజేపీ కార్యకర్తలు శుక్రవారం ఢిల్లీకి బయలు దేరి వెళ్లారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు శశిభూషణ్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు వెంకట సుబ్బారెడ్డి, హరిప్రసాద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లక్ష్మినారాయణరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బాలకృష్ణ యాదవ్, బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి బత్తల పవన్‌కుమార్, జిల్లా అధ్యక్షులు విజయ్ ఆధ్వర్యంలో సేకరించిన మట్టిని ఒక కలశంలో ఉంచి జిల్లా పార్టీ కార్యాలయం నుంచి రైల్వే స్టేషన్ వరకు ర్యాలీగా వెళ్లారు.



మేరీ మట్టి.. మేరీ దేశ్ కార్యక్రమంలో భాగంగా త్రివర్ణ పతాకంతో ర్యాలీగా వెళుతున్న విద్యార్థినులు

బెటాలియన్‌లో ఓపెన్ హౌస్

సిద్దవటం : మండలంలోని ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌లో పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించామని అసిస్టెంటు కమాండెంటు వి. కేశవరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమాండెంటు ఎస్. శ్రీనివాస రావు ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. బెటాలియన్‌లో ఉన్న ఆయుధాలు, సాంకేతిక పరికరాల పనితీరును విద్యార్థులకు తెలియజేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంటు కమాండెంట్లు వి.విజయప్రసాద్, వెంకట్‌రెడ్డి, ఆర్‌ఐలు, ఏఆర్‌ఎస్‌ఐలు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యశాలను అప్‌గ్రేడ్ చేస్తాం



రాజోలు వీరారెడ్డితో చర్చిస్తున్న కమిషనర్ రాజేంద్రకుమార్

వల్లూరు : పెద్దపుత్తలోని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలను అప్‌గ్రేడ్ చేస్తామని ఆయుష్ కమిషనర్ ఎస్‌బీ రాజేంద్రకుమార్ తెలిపారు. శుక్రవారం పెద్దపుత్తలోని ఆయుర్వేద వైద్యశాలను పరిశ్రమల రాష్ట్ర సలహాదారుడు రాజోలి వీరారెడ్డితో కలసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పెద్దపుత్తలో ఆయుర్వేద వైద్యశాలను అప్‌గ్రేడ్ చేస్తామన్నారు. ఇందుకుగాను అవసరమైన భవన నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం తరపున రూ.10 లక్షలు మంజూరు చేస్తామన్నారు. అయితే భవన నిర్మాణానికి స్థలంతో పాటు మరో రూ.20లక్షలు గ్రామ ప్రజలు పోగు చేస్తే ఈ ఆసుపత్రిని అప్‌గ్రేడ్ చేస్తామన్నారు. అలాగే అవసరమైన వైద్యాధికారులను, సిబ్బందిని నియమిస్తామన్నారు. ఇండస్ట్రీస్ స్టేట్ అడ్వైజర్ రాజోలు వీరారెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి చొరవతో పెద్దపుత్తలోని ప్రభుత్వ ఆయుర్వేద వైద్య శాలను అప్‌గ్రేడ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్‌డీడీ కేవీ కుమార్‌బాబు, ఏఓ భుసేజరావు పాల్గొన్నారు.

డోర్ డెలివరీపై అవగాహన

కడప కోటిరెడ్డిసర్కిల్ : 50 కిలోల వరకు బుకింగ్ చేసిన పార్శిళ్లు, కొరియర్లను మీ ఇంటి వద్దకే చేర్చేందుకు ఏపీఎస్ ఆర్టీసీ డోర్ డెలివరీ ప్రచార మాసోత్సవాన్ని నిర్వహిస్తోందని, ప్రతి ఉద్యోగి ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కడప డిపో మేనేజర్ ఢిల్లీశ్వరరావు తెలిపారు. శుక్రవారం నగరంలోని కడప డిపో కార్యాలయ ఆవరణలో ఉద్యోగులకు డోర్ డెలివరీ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 90 ముఖ్య పట్టణాల్లో డోర్ డెలివరీ సదుపాయం కల్పించారని, పార్శిల్ కౌంటర్ నుంచి పది కిలోమీటర్ల పరిధిలో ఈ డోర్ డెలివరీ అందుబాటులో ఉందన్నారు. కిలో వరకు రూ. 18, ఆరు కిలోల వరకు రూ. 30, పది కిలోలలోపు వరకు రూ. 36, ఇరవై ఐదు కిలోల వరకు రూ. 48, యాభై కిలోల వరకు రూ. 59 చొప్పున వసూలు చేస్తున్నామన్నారు. ఇతర వివరాలకు కడప డిపో మేనేజర్ 995922 5774, ఏటీఎం కమర్షియల్ 99592 23209, జిల్లా ప్రజా రవాణాధికారి 99592 25848 నెంబరులో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో కడప డిపో సూపరింటెండెంట్ సిద్దయ్య, యూనియన్ నాయకులు ఏఆర్ మూర్తి, రాము, కండక్టర్లు, డ్రైవర్లు పాల్గొన్నారు.



డోర్ డెలివరీపై అవగాహన కల్పిస్తున్న డీఎం ఢిల్లీశ్వరరావు

గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గుర్తించాలి

– అడిషినల్ సీనియర్ సివిల్ జడ్జి ప్రదీప్‌కుమార్

కడప ఎడ్యుకేషన్: పాఠశాల దశ నుంచే బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ అడిషినల్ సీనియర్ సివిల్ జడ్జి, ఫుల్ అడిషినల్ చార్జ్ సెక్రటరీ ప్రదీప్‌కుమార్ సూచించారు. శుక్రవారం కడప నగరంలోని చెమ్మియాపేట జిల్లా పరిషత్తు బాలికల ఉన్నత పాఠశాల, కాగితాల పెంట జిల్లా పరిషత్తు ఉర్దూ ఉన్నత పాఠశాలలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్, స్నేహపూర్వక స్వభావం, సోదరభావం, దేశభక్తి తదితర అంశాలపై వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు చాలా చోట్ల అమ్మాయిలు, మహిళలు అఘాయిత్యాలు, వేధింపులకు గురవుతున్నారన్నారు. వీటిపై అవగాహన లేక బాధితులుగా మారుతున్నారన్నారు. పాఠశాల స్థాయి నుంచే బాలికలకు బ్యాడ్‌టచ్, గుడ్‌టచ్‌లపై అవగాహన కల్పించాలన్నారు. అలాగే ఒకరిపట్ల ఒకరు సోదరభావాన్ని పెంపొందించడంతోపాటు దేశభక్తి కలిగి ఉండేలా తెలియ చెప్పాలన్నారు. అనంతరం విద్యార్థులకు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీం సభ్యులు సురేష్, సహాయం, నిర్మలాదేవి, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జి ప్రదీప్‌కుమార్

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



స్పెషల్ క్యాంపెయిన్‌లో పాల్గొన్న ఏపీజీబీ చైర్మన్ రాకేష్ కశ్యప్, ఇతర అధికారులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటు అందించాలని ఏపీజీబీ చైర్మన్ రాకేష్ కశ్యప్ తెలిపారు. భారత ప్రభుత్వం ప్రారంభించిన స్పెషల్ క్యాంపెయిన్ 3.0లో భాగంగా కడప నగరంలోని సెయింట్ జోసెఫ్ జూనియర్ కళాశాలలో 187 మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ స్వార్థ ప్రయోజనాల కోసం చెట్లను ఇష్టానుసారంగా తొలగించడం జరుగుతోందన్నారు. ఈ కారణంగానే సరైన సమయంలో వర్షాలు కురవడం లేదన్నారు. భవిష్యత్తు తరాలను దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి దాని సంరక్షణ బాధ్యతలను స్వీకరించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్లు కె.విజయభాస్కర్, ఎం.జగదీశ్వర్‌రావు, సంజీవప్ప, పడగేట్వర్, ఆర్.గిరి, చీఫ్ మేనేజర్లు పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రాల్లో పంట నమోదు జాబితా

వీరపునాయునిపల్లె : ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసిన పంటల నమోదు జాబితాను మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచామని కమలాపురం వ్యవసాయ సహాయ సంచాలకులు నరసింహారెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని ఎస్.పాలగిరి, గంగిరెడ్డిపల్లె, వెల్దుర్తి రైతు భరోసా కేంద్రాల్లో జరుగుతున్న సామాజిక తనిఖీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పంట నమోదు చేసిన ప్రతి రైతు తమ పేరు, సాగు చేసిన పంట, విస్తీర్ణం జాబితాల్లో ఉందా లేదా అని చూసుకోవాలని ఏవైనా పొరపాట్లు ఉంటే ఈనెల 29వ తేదీలోపు వ్యవసాయ సిబ్బందికి తెలియజేయాలని సూచించారు. రైతుల నుంచి అందిన అభ్యంతరాలను పరిష్కరించి నవంబర్ 1వ తేదీన తుది జాబితాను అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శిస్తామన్నారు. అనంతరం గ్రామ సభలు నిర్వహిస్తామన్నారు. మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు మాట్లాడుతూ ఈకేవైసీ 100 శాతం పూర్తైందన్నారు. జాబితాలో పొరపాట్లు ఉన్నట్లు గుర్తించిన రైతులు రాత పూర్వకంగా తెలియజేయాలని కోరారు.

నేడు ప్రొద్దుటూరులో ట్రాఫిక్ మళ్లింపు

– ఇన్‌చార్జి డీఎస్పీ నాగరాజు

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలో వైఎస్సార్‌సీపీ నిర్వహించే సామాజిక సాధికారత యాత్ర సందర్భంగా శనివారం ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు ఇన్‌చార్జి డీఎస్పీ నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. రైల్వే స్టేషన్‌రోడ్డులోని వైవీఆర్ కల్యాణ మండపం నుంచి రామేశ్వరం, గాంధీరోడ్డు మీదుగా విజయ్‌కుమార్ సర్కిల్, రాజీవ్ సర్కిల్, శివాలయం సర్కిల్ వరకు యాత్ర ఉన్నందున మధ్యాహ్నం 12 గంటల నుంచి ప్రజలు ఇరువైపులా ఉన్న రింగు రోడ్డు మీదుగా రాకపోకలు సాగించాలన్నారు. జమ్మలమడుగు వైపు నుంచి వచ్చే బస్సులు పట్టణంలోకి రాకుండా పొట్టిపాడు క్రాస్ రోడ్డు ద్వారా, మైదుకూరు వైపు నుంచి వచ్చే బస్సులు ఆర్టీసీ బస్టాండు దగ్గర నుంచి, రాజుపాళెం వైపు నుంచి వచ్చే బస్సులు మల్లేలమ్మ గుడి వద్ద నుంచి, ఎర్రగుంట్ల వైపు నుంచి వస్తున్న బస్సులు పట్టణంలోకి రాకుండా వాసవి సర్కిల్ నుంచి రాకపోకలు సాగించాలని సూచించారు. జమ్మలమడుగు వైపు నుంచి వ్యక్తులు వారి వాహనాలను ఎగ్జిబిషన్ గ్రౌండ్ వద్ద ఉన్న అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణం, మార్కెట్ యార్డులో, రాజుపాళెం వైపు నుంచి వచ్చే వారు కార్లు, బైక్‌లను పాలిటెక్నిక్ కాలేజీలో, మైదుకూరు, ఎర్రగుంట్ల వైపు నుంచి వచ్చే వారు టూ టౌన్ బైపాస్ రోడ్డులో వాహనాలను పార్కింగ్ చేయాలన్నారు.

నేడు అత్తిరాలలో గిరి ప్రదక్షిణ

రాజంపేట రూరల్ : ప్రముఖ శైవ పుణ్యక్షేత్రమైన అత్తిరాలలో శనివారం సాయంత్రం 6 గంటల నుంచి గిరి ప్రదక్షిణ కార్యక్రమం చేపడుతున్నట్లు గిరి ప్రదక్షిణ కమిటీ సభ్యులు శుక్రవారం తెలియజేశారు. బాహుదానది వద్ద గంగా హారతిని ఇచ్చి కార్యక్రమం ప్రారంభిస్తామని తెలియజేశారు. ప్రదక్షిణ సమయంలో వినాయకస్వామి గుడి వద్ద భక్తులకు తీర్థ ప్రసాదాలను రవి ఆచారి అందజేయనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమం అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని యూపీ రాయుడు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. భక్తుల కోసం శ్రీచక్ర హైస్కూల్ ఎండీ రాఘవరెడ్డి వెంకటేశ్వరరెడ్డి బస్సు సౌకర్యం ఏర్పాటు చేశారన్నారు. భక్తులు ఈ గిరి ప్రదక్షణలో పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

కౌన్సెలింగ్‌ను నిర్వహించాలి

కడప ఎడ్యుకేషన్: ఏపీ ఈఏపీసెట్ మూడవ విడత కౌన్సెలింగ్‌ను నిర్వహించాలని పీడీఎస్‌యూ నగర సహాయ కార్యదర్శి శ్రీనాథ్, నగర ఉపాధ్యక్షుడు విశ్వనాథ్‌లు అన్నారు. ఈ విషయమై శుక్రవారం డీఆర్‌ఓ గంగాధర్‌ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించి సంబంధిత సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి విద్యా సంవత్సరం మూడు విడతలుగా ఈ ప్రక్రియను నిర్వహించేవారన్నారు. అయితే ఈ ఏడాది ఈ ప్రక్రియను రెండు విడతలకే పరిమితం చేశారన్నారు. చాలామంది విద్యార్థులు మూడవ విడత కౌన్సెలింగ్ కోసం ఎదురు చూస్తున్నారన్నారు.

ఎంపీ, డిప్యూటీ సీఎంలను కలిసిన ఆర్డీఓ



కడప ఎంపీని కలిసిన ఆర్డీఓ మధుసూదన్

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఇటీవల కడప రెవెన్యూ డివిజనల్ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన మధుసూదన్ శుక్రవారం ప్రజాప్రతినిధులు, అధికారులను కలిశారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషను ఆయన క్యాంపు కార్యాలయంలో, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని కడప ఎయిర్‌పోర్టులో ఆర్డీఓ మర్యాద పూర్వకంగా కలిశారు. అలాగే జిల్లా ఎస్పీ సిద్ధార్థ కౌశల్‌ను ఆయన కార్యాలయంలోని చాంబర్‌లో కలిశారు. ఈ సందర్భంగా వారు పలు అంశాలపై చర్చించారు.

నిధులు మంజూరు చేయాలి

కడప ఎడ్యుకేషన్: జిల్లాలో నాడు– నేడు రెండవ దశ పనులకు సంబంధించి పాఠశాలలకు నిధులను మంజూరు చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి డిమాండ్ చేశారు. ఈ విషయమై శుక్రవారం సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డిని కలిసి సంఘం తరఫున వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ సమగ్రశిక్షలో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాల చెల్లింపులో ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి కృషి అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా నాయకులు సుబ్బారెడ్డి, ఖదీర్‌బాష తదితరులు పాల్గొన్నారు.

వేలంపాట

సిద్దవటం : శ్రీ నిత్యపూజ స్వామికి భక్తులు సమర్పించుకునే తలనీలాల వేలం పాటను సిద్దవటంకు చెందిన కూనా విజయభాస్కర్ రూ.2.34 లక్షలకు దక్కించుకున్నారని ఆలయం ఈఓ మోహన్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని లంకమల్ల అడవుల్లో వెలసిన శ్రీ నిత్యపూజస్వామి ఆలయంలో కార్తీక మాసంలో భక్తులు తలనీలాల పోగు హక్కు కోసం శుక్రవారం సిద్దవటంలోని శ్రీ రంగనాయక స్వామి ఆలయంలో బహిరంగ వేలం పాటను నిర్వహించారు. ఇందులో సిద్దవటం ఎగువపేటకు చెందిన విజయభాస్కర్ రూ.2.34 లక్షలకు వేలం పాడి హక్కును దక్కించుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రాజంపేట దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శివయ్య, ఆలయ చైర్మన్ పాటూరు కొండారెడ్డి, సిబ్బంది చంద్ర తదితరులు పాల్గొన్నారు.

రాహుకాల పూజలు



అమ్మవారికి హారతులు పడుతున్న మహిళలు

రాయచోటి టౌన్ : శ్రీ భద్రకాళి అమ్మవారి సన్నిధిలో రాహుకాల పూజలు భక్తిశ్రద్ధలతో జరిపారు. శుక్రవారం అమ్మవారికి రాహుకాల పూజలలో భాగంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి పూలు, ఆభరణాలు, పట్టువస్త్రాలు, నిమ్మకాయలతో తయారు చేసిన హారాలతో అలంకరించారు. పూజలలో మహిళలు నిమ్మకాయలపై వత్తులు వెలిగించి హారతులు పట్టారు. పూజలలో స్థానిక భక్తులతోపాటు కన్నడ భక్తులు విశేషంగా పాల్గొన్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.



ప్రత్యేక అలంకరణలో భద్రకాళి